

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి-రాయచోటి : రెండు నెలలుగా తాము తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని కాటిమాయకుంట దళితులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. రాయచోటి మండలం కాటిమాయకుంట గ్రామం హరిజనవాడకు చెందిన ప్రజలు దాదాపు 50 మంది ఖాళీ బిందెలతో కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలలుగా ఉన్న ఒక బోరు చెడిపోయి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనుకనే మేము కలెక్టరేట్ కు రావాల్సి వచ్చిందని వారు తెలిపారు. కలెక్టర్ వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టర్ అభిషేక్ కిశోర్ కు వినతిపత్రం అందజేశారు.

కడప పార్లమెంట్ బరిలో షర్మిల?

- సొంత జిల్లాలో పట్టు నిరూపణకు యత్నం
- అసెంబ్లీలకు బలమైన అభ్యర్థుల అన్వేషణ
- షర్మిలను కలిసిన ఓ మాజీ ఎమ్మెల్యే
- నేడు జిల్లాకు షర్మిల రాక?
- రాజంపేట పార్లమెంట్‌కు నజీర్‌అహ్మద్


కాంగ్రెస్ ఎన్నికల రేసులో నిలిచేందుకు పావులు కదుపుతోంది. పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల కడప పార్లమెంటుకు పోటీ చేయనున్నట్లు వస్తున్న వార్తలు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. జిల్లాలోని కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ అసెంబ్లీ బరిలో బలమైన అభ్యర్థులను బరిలో నిలపడంపై దృష్టి సారించింది. నెల రోజుల క్రితం నుంచి జిల్లాలోని ఏడు అసెంబ్లీల నుంచి ఆశావహుల దరఖాస్తులను స్వీకరించింది. గట్టి పట్టు కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో నిమగ్నమైంది. జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో అమీర్ ఫంక్షన్ ప్యాలెస్‌లో ముస్లిమ్ సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తోంది. వైసిపి, టిడిపి అసంతృప్తులు, సీట్లు దక్కని ఆశావహులు, కాంగ్రెస్ సీనియర్లు సహా ఆశావహులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/రాయచోటి

జిల్లా రాజకీయాలపై వైసిపి గట్టి పట్టు సాధించింది. మాజీ ముఖ్య మంత్రి వైఎస్ఆర్ మరణానంతరం జరిగిన ప్రతి ఎన్నికల్లో అస్పష్టమైన ఆధి పత్యాన్ని సాధిస్తూ వస్తోంది. వైసిపి ఆవిర్భావం నుంచి ప్రతిపక్ష టిడిపి ఎదురు దెబ్బలు తప్పడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో పిసిసి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిల కడప పార్లమెంట్ బరిలో నిలవడం ఆసక్తిని కలిగిస్తోంది. సొంత జిల్లాలో పట్టు సాధించడంలో అవసరమైన ఓట్లు, సీట్లు సాధించడంపై దృష్టి సారించింది. దీనిపై ఆధారపడి ఆమె రాజకీయ భవితవ్యం ఆధారపడి ఉంటుందని చెప్పవచ్చు. జిల్లాలోని కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ నియోజకవర్గాల్లో ప్రాబల్యం కలిగిన నాయక గణాన్ని అన్వేషిస్తోంది. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల బరిలో బలమైన అభ్యర్థులను నిలిపి ఆశావహమైన ఓట్లు, సీట్లు సాధిస్తే భవిష్యత్ అధికార, ప్రతిపక్ష పార్టీలకు ప్రమాదకర సంకేతాలు ఇచ్చినట్లు అవుతుందనడంలో సందేహం లేదు. జిల్లాలో అధికార, ప్రతిపక్ష పార్టీలు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ సైతం అభ్యర్థుల ప్రకటన కసరత్తు వేగవంతం చేసింది. నేడో, రేపో అభ్యర్థుల జాబితాను విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. కడప పార్లమెంట్‌కు షర్మిల, రాజంపేట పార్లమెంట్‌కు మాజీ డిసిసి అధ్యక్షులు నజీర్ అహ్మద్ పేరు దాదాపుగా ఖరారైనట్లు తెలుస్తోంది.



వై.ఎస్.షర్మిల



నజీర్ అహ్మద్

వైఎస్ షర్మిల పిసిసి బాధ్యతలు చేపట్టిన వెంటనే కాంగ్రెస్ బలోపేతంపై దృష్టి సారించింది. ఇప్పటికే జిల్లాలో రెండు దఫాలు పర్యటించారు. ప్రతి పర్యటనలో ఆశించిన స్పందన లభించింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కడప పార్లమెంట్‌కు ఆమె పోటీ చేయనున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో పార్టీని మరింత బలపేతం చేయడంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, సీనియర్ నాయకులతో సంప్రదింపులు చేసింది. మాజీ మంత్రులు డిఎల్, అహ్మదుల్లాలను కలిసిన సంగతి తెలిసిందే. వీరితోపాటు టిడిపి, వైసిపిలో టికెట్లు దక్కని నాయకులపై దృష్టి సారించే అవకాశం కనిపిస్తోంది. మంగళవారం సాయంత్రం అమీర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేయనున్న ఇఫ్తార్ విందుకు వచ్చినప్పుడు సంప్రదింపులు వేగవంతం చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

రాజంపేట పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా నజీర్ అహ్మద్?

రాజంపేట పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా కడపకు చెందిన షేక్.నజీర్ అహ్మద్‌ను సోమవారం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. ఈయన గతంలో 2019 సంవత్సరంలో కడప అసెంబ్లీ నుంచి పోటీ చేశారు. గతంలో కడప ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా పనిచేశారు. ప్రస్తుతం మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్నారు. ఇప్పటికే రాజంపేట నుంచి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, బిజెపి నుంచి మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పోటీలో ఉన్నారు. జిల్లాలో అన్ని పార్టీలు ఎంపీ అభ్యర్థులను ఖరారు చేసింది. ఇప్పటికే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, మహా కూటమి ఎంపీ అభ్యర్థులు ప్రచారం మొదలుపెట్టారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థుల ఎంపిక చేయడంతో పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో తాగునీటి సమస్య రాకూడదు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులకు సూచించారు. సోమవారం విజయవాడ, వెలగపూడి సచివాలయం నుంచి ఎంజిఎన్ఆర్ఇజిఎస్ తాగునీటి సరఫరా, పింఛన్ల పంపిణీ, తదితర అంశాలపై అన్ని జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి ఎదురు కాకుండా చూడాలన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, వచ్చే రెండు, మూడు నెలలు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇందుకు సంబంధించి బోర్వెల్ డిపినింగ్ చేయడం, పైప్లైన్ లీకేజీని అరికట్టడం, స్కీమ్స్ పనిచేసేలా చేయడం, వంటి పనులు చేపట్టి నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కొన్ని ప్రాంతాలలో అధికారుల పర్యవేక్షణ లేక నీటి సమస్యలు ఉన్నాయని నీటి సమస్యపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపిడిఒలు ముందుగానే ప్రతి స్కీమ్‌ని పరిశీలన చేసుకుని అవి పనిచేసేలా చూడాలన్నారు. తాగునీటి కోసం విద్యుత్ సమస్య రాకుండా ఎప్పటికప్పుడు ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారులతో సంప్రదించాలన్నారు. జిల్లాలో మొత్తం 2.26 లక్షల పెన్షన్లు పంపిణీ చేసేవారమని, జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పెన్షన్ల పంపిణీకి సంబంధించి త్వరలో నూతన మార్గదర్శకాలు ఇవ్వడం ఇస్తారన్నారు. మార్చి 31వ తేదీ ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా ఏప్రిల్ 1న ఇవ్వాల్సిన పింఛన్లు 3న మధ్యాహ్నం నుంచి కానీ, 4న ఉదయం ఉదయం నుంచి పింఛన్లు అందజేస్తారన్నారు. పింఛన్దారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్ కార్డులు మంజూరు చేసి పని కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పేదల కోసం సమర్థవంతంగా నిర్వహిస్తోందని పథకం ద్వారా గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన జీవనోపాధి కల్పించే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. పనిచేసే ప్రాంతంలో కూలీలకు ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం నీరు, సేమియానా, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, వంటి అన్ని వసతులు ఉండేటట్లు చూడాలన్నారు. కూలీలు వలస పోకుండా ఉండాలంటే పని దినాలను పెంచాలని, పనులు లేని ప్రాంతాల్లో రహదారుల పక్కన ముళ్ళ పొదలను తొలగించడం, రోడ్డు విస్తరణ వంటి పనులు చేయించాలన్నారు. అధికారులు ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాలలో నిరుపేద ఎస్సీ,ఎస్టీ వారికి ఉపాధి కల్పించేలా చూడడంతో పాటు విభిన్న ప్రతిభావంతులను కూడా పనులలో భాగస్వామ్యం చేయాలన్నారు.ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటలకే ఉపాధి పనులను ప్రారంభించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పథకం పనులను తరచూ పర్యవేక్షించాలన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 27 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ఎంఎస్ఎన్ లాబరేటరీ ప్రయివేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారిచే నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 27 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత తెలిపారు. ఎంఎస్ఎన్ లాబరేటరీ హెచ్ఆర్ బృందం ఆంటోనీ జోషి, టాలెంట్ యాక్విజేషన్ టీం, హెచ్ఆర్ డిపార్ట్మెంట్ అభిరామ్ సోమవారం అన్న మాచార్య ఫార్మసీ కళాశాలలో డాక్టర్ పి.ద్వారకానాథరెడ్డి ఆధ్వర్యంలో అర్హత కలిగిన 100 మంది విద్యార్థులు రాత పరీక్ష, హెచ్ఆర్ రౌండులో పాల్గొనగా 27 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు తెలిపారు. తమ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించడం ఏడాదిలో ఇది ఐదవ సారి అని తెలిపారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి చొప్ప గంగిరెడ్డి, కోశాధికారి అభిషేక్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎల్లారెడ్డి, చైర్మన్ రామచంద్రారెడ్డి అభినందించారు.

నవోదయకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల కేంద్రంలోని శ్రీప్రత్యూష హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న ఇద్దరు విద్యార్థులు నవోదయకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ కాసల భాను ప్రసాద్, ప్రిన్సిపల్ టివి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన ఎస్.భావన సాయి, సి.లలిత నవోదయకు ఎంపికైనట్లు, ప్రతి సంవత్సరం తమ పాఠశాల నుంచి ఇద్దరు లేక ముగ్గురు విద్యార్థులు నవోదయకు ఎంపిక అవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు నవోదయకు ఎంపిక పట్ల ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని ప్రిన్సిపల్ అభినందించారు. ఎంపికైన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు నరసింహులు, రవీంద్రబాబు, రాధా, వాసు దేవరాజు, సరళమ్మ, సుధాకర్, ఈశ్వరయ్య, రహిమాన్ అభినందించారు.

ఆశాజనకంగా ఇంటి పన్ను వసూళ్లు : కమిషనర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట : నగర పంచాయతీలో ఆశాజనకంగా పన్నులు వసూలయ్యాయని కమిషనర్ పి.ఆర్.మనోహర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీలో పెండింగ్‌లో ప్రస్తుతం మార్చి 31 చివరి రోజు కావడంతో రాత్రి 12 గంటల వరకు చెల్లింపు గడువు ఇచ్చిన నేపథ్యంలో ఇంటి పన్ను 260 మంది ప్రజలు బకాయిలు చెల్లించడంతో రూ.15,48,300 వసూలైనట్లు పేర్కొన్నారు. మార్చి 31కి మొత్తం ఆన్‌లైన్ పద్ధతిలో రూ.1.96 కోట్లు వసూలైందన్నారు. 2023 మార్చి చివర నుండి 2024 ఆర్థిక సంవత్సరానికి రూ.2.80 కోట్ల బకాయిలుగాను రూ.1.96 కోట్లు వసూలు చేసామన్నారు. మార్చిలో మాత్రమే రూ.98 లక్షలు వసూలు చేశామని తెలిపారు. పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని నగర పంచాయతీ పారిశుధ్య కార్మికుల వేతనాలు, విద్యుత్ ఛార్జీలకు మాత్రమే వినియోగిస్తామన్నారు.

పకడ్బందీగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ : కలెక్టర్

ప్రజాశక్తి- రాయచోటి : జిల్లాలో పకడ్బందీగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణకు తగిన కార్యాచరణ రూపొందించుకొని ముందుకు వెళ్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. సోమవారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు అధికారుల బాధ్యతలు, వారు నిర్వహించాల్సిన విధులపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో విసి నిర్వహించి వివరాలు తెలుసుకొని పలు అంశాలలో దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో పారదర్శకంగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ అండ్ హోమ్ ఓటింగ్‌కు సంబంధించి ఏప్రిల్, మే మాసాల్లో తేదీల వారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై తగిన కార్యాచరణను రూపొందించాలని సూచించారు. ఇటిపిబిఎస్ ద్వారా సర్వీస్ ఓటర్ల పోస్టల్ బ్యాలెట్ ప్రింటింగ్, జనరేషన్‌ను పకడ్బందీగా చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే పిఒ, ఎపిఒ, ఒపిఒ, మైక్రోఅబ్జర్వర్లు, పోలీసులు, ఇతర ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాలు కల్పించడం, అందుకు అవసరమైన ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు తదితర అంశాలలో కట్టుదిట్టంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ రావు పాల్గొన్నారు.

నీటి సమస్యను గుర్తించి పరిష్కరించాలి : పీడీ

ప్రజాశక్తి-రామాపురం : మండల పరిధిలో నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి నీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ ఎం సి మద్దిలేటి అన్నారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల పరిషత్ భవనంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి వేసవికాలంలో గ్రామాల్లో ఎక్కడా నీటి సమస్య లేకుండా చూడడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని చెప్పారు ఉపాధి, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సమన్వయంతో నీటి ఎద్దడి గ్రామాలను గుర్తించి సమస్య లేకుండా చూడానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఉన్న నీటిని సద్వినియోగం చేసుకొనేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్, ఎపిఒ సురేంద్ర నాథ్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా నీటి వ్యాపారం

జిల్లా కేంద్రమైనా నీరు కొనాల్సిందే
అదుపులో లేని ధరలు
ఇబ్బందుల్లో పట్టణ ప్రజలు



ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటి జిల్లా కేంద్రమైనా కొన్నేళ్ల నుంచి ప్రజలు తాగునీ కోసం పడరాని పాట్లు పడుతున్నారు. వేసవి వచ్చిందంటే తాగునీటి కోసం ఇబ్బం దులు తప్పడం లేదు. డబ్బులు పెట్టి నీరు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. మున్సిపల్ పరిధిలో 34 వార్డులున్నాయి. మినరల్ వాటర్ ప్లాంట్లు దాదాపు 42 ఉన్నాయి. ఇందులో ఏ ఒక్క ప్లాంట్‌కూ అనుమతులు లేవు. పట్టణంలో 25 వేల గృహాలు, లక్షకు పైగా జనాభా ఉన్నారు. రాయచోటిని జిల్లా కేంద్రం చేసినా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. నీటి సమస్యపై శాశ్వత పరిష్కారం ఆలోచించే ప్రజా ప్రతినిధి కానీ, అధికారులు కానీ లేరని పలువురు విమర్శిస్తున్నారు. పట్టణ ప్రజల అవసరాల కోసం వెలిగల్లు ప్రాజెక్టు నుంచి గతంలో నాలుగు, ఐదు రోజులకు ఒక్కసారి నీటిని సరఫరా చేశారు. ప్రస్తుతం ఏడు, ఎనిమిది రోజులకు ఒక్కసారి సరఫరా చేస్తున్నారు. అదీ ఒక గంట మాత్రమే వదలడంతో అవి చాలక పోవడంతో వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతూ సచివాల యాల వద్ద సంబంధిత అధికారులకు విన్నవించుకుంటూ నిరసనలు చేపడుతున్నారు. వచ్చే నీటిని గంటపాటు కాకుండా మరికొంత సమయం ఎక్కువగా వచ్చేలా చూడాలంటూ వేడుకుంటున్నారు. అది కూడా ఏ సమయంలో వదులుతారో తెలియని పరిస్థితి. నీటిని ఒకే సమయంలో వదలాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. దాదాపు 30 సంవత్సరాల నుంచి రాయచోటి ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. పార్టీలు న్నికల ముందు తాగునీటి సమస్యపై హామీలిచ్చి ఓట్లు దండుకుని గద్దెనెక్కిన తరువాత ఆ సమస్యను గాలికి వదిలేస్తున్నారు. ప్రస్తుతం 20 లీటర్ల క్యాన్ రూ.15, 25 లీటర్ల క్యాన్ రూ. 20, బిందె రూ.15, కూల్ వాటర్ క్యాన్ రూ.40 చొప్పున నీటి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా రాయచోటిలో కొనసాగుతుంది. మినరల్ వాటర్‌ను చిన్నచిన్న వాహనాల్లో స్టీల్ డ్రములతో ఉంచుకుని విధుల్లో తిరుగుతూ విక్రయిస్తున్నారు. ఉదయం నిద్ర లేచిన వెంటనే తాగునీటి కోసం ప్రజలు ఎదురు చూస్తుంటారు. ఉద్యోగాలకు వెళ్లేవారు, వ్యాపారాలు చేసుకునేవారు, కూలీలు చేసుకునేవారు తప్పని సరిగా నీటిని కొనుగోలు చేసి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి రాయచోటి ప్రాంతంలో నెలకొంది. గతంలో రూపాయి ఇచ్చి తాగునీటి ప్యాకెట్లను కొని తాగేవారు. ప్రస్తుతం ప్లాస్టిక్ నిషేదించడంతో రైతులు, వ్యాపారులు బయట ప్రాంతాల నుంచి వచ్చి దాహార్తిని తీర్చుకోవాలంటే రూ.పది పెట్టి తప్ప నిసరిగా అర లీటర్లు బాటిల్ కొని తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేసవి వచ్చిందంటే తాగు నీటి సమస్య ఈ ప్రాంతంలో తీవ్రంగా ఉంటుంది. గతంలో తాగునీటి సమస్య ఉన్నప్పుడు స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రజలకు ట్యాంకర్లతో వీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం గుక్కెడు నీరు ఉచితంగా ఇచ్చే పరిస్థితి పట్టణంలో ఎక్కడ కనిపించడం లేదు.



వాహనం ద్వారా నీటిని సరఫరా చేస్తున్న వ్యాపారులు


జిల్లాగా ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్నా...

రాయచోటి జిల్లాగా ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్నా నేటికీ మౌలిక వసతులు లేకపోవడం గమనార్హం. దీనికి తోడు రాయచోటిలో నీటి వ్యాపారం మరింత ఊప ందుకుంది. మున్సిపల్ అధికారులు అనుమతులు లేని మినరల్ వాటర్ ప్లాంట్లపై శ్రద్ధ తీసుకోక పోవడంలో అంతర్యం ఏమిటి అని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇష్టారాజ్యంగా నీటి వ్యాపారం జరుగుతున్నా ఏ ఒక్క అధికారి కూడా ప్లాంట్ వద్దకు వెళ్లి సక్రమంగా మినరల్స్ నీటిని శుద్ధి జరుగుతుందా, లేదా అని గమనించిన పాపన పోలేదు. కొందరు ఏకంగా మినరల్ వాటర్ పేరు చెప్పి బోర్ల వద్ద నీటిని నింపుకొని ఆ నీటిని ప్రజలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. అయినప్పటికీ ప్రజలు మినరల్ వాటర్ అని నమ్మి వారిచ్చే నీటిని కొని తాగుతున్నప్పటికీ కొందరు అనారోగ్యాల గురవుతున్నట్లు సమాచారం.

33వ వార్డులో పైపు లైనే లేదు..

మున్సిపల్ పరిధిలో 33వ వార్డులో ఇప్పటి వరకు వెలిగెల్లు ప్రాజెక్ట్‌కు సంబంధించిన పైపు లైన్‌కు ఇప్పటి వరకు సరఫరా అందించక పోవడం శోచనీయం. ఈ వార్డులో ఇందిరమ్మ కాలనీలో 450, గొల్లపల్లి 250, ఎగువ అబ్బవరంలో 80 కుటుంబాలు నివాసం ఉన్నారు. తాము మున్సిపాలిటీకి సంబంధించిన అన్ని పనులు కడుతున్నామని, కానీ తమ ఇంటి దగ్గరికి వెలిగల్లు నీరు ఇంతవరకు సరఫరా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం లో ఎక్కువగా కూలీ చేసుకునేవారే ఉన్నారు. రోజూ డబ్బులు పెట్టి తాగునీరు కొనాలంటే ఇబ్బంది పడుతున్నారు. నాయకులు కానీ, అధికారులు కానీ, ఏ ఒక్కరూ ఆలోచించిన పాపాన పోలేదు. ఇప్పటికైనా తాగునీటి ధరలకు నియంత్రణ చేసి, అనుమతులు లేని వాటర్ ప్లాంటు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తాగునీటి ధరలను నియంత్రించాలి..



శుద్ధి చేసిన వాటర్ ప్లాంట్‌లో నీటి ధరలను మున్సిపల్ అధికారులు వెంటనే నియంత్రించాలి. వెలిగల్లు నీటి సరఫరా చేయకముందే ముందే ప్రజలకు చేరువ చేయాలి. నిత్యం ఉపయోగించే వెలిగల్లు నీటిని రెండు రోజులకు ఒకసారి వదలాలి.

-డి.సి.వెంకటయ్య, స్థానికుడు, ఇందిరమ్మ కాలనీ, రాయచోటి.

మా దృష్టికి రాలేదు..



మున్సిపాలిటిలో నేను ఈ మధ్యకాలంలోనే కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నాను. వాటర్ ప్లాంట్ అన్ని పరిశీలించి సక్రమంగా శుద్ధి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటాం. వాటర్ ప్లాంట్ ద్వారా తాగునీటిని అధికరేట్లకు సరఫరా చేస్తున్నారని ప్రజలు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం. త్వరలో పట్టణంలోని అన్ని ప్లాంట్‌ను పరిశీలిస్తాం.

- వాసు బాబు, మున్సిపల్ కమిషనర్, రాయచోటి

సిఎఎ అమలుపై జగన్ స్పష్టత ఇవ్వాలి : విసికె

ప్రజాశక్తి-మదనపల్లి

దేశాన్ని ప్రమాదంలోకి నెట్టి, ముస్లిం మైనార్టీల ఉనికిని దెబ్బకొట్టి వారి భవిష్యత్తును అంధకారం చేస్తున్న సిఎఎ (పౌరసత్వ సవరణ చట్టం) అమలుపై వైసిపి అధినేత జగన్మోహనరెడ్డి మదనపల్లె బహిరంగ సభలోనైనా స్పష్టత ఇవ్వాలని, విడుదలై చిరుతైగల్ కట్చి (విసికె పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోనూ సిఎఎ చట్టం అమలు చేయబోమని జగన్ ప్రకటించడం అవసరమని పేర్కొన్నారు. మైనార్టీలను ఉద్ధరిస్తానని రోజూ గొప్పగా చెప్పే జగన్మోహనరెడ్డి, ఇప్పటికీ దీనిపై స్పష్టత ఇవ్వకపోవడం సహేతుకంగా లేదన్నారు. రాజ్యాంగం ముందు భారత పౌరులందరూ సమానమే అన్న మూల సూత్రానికి భిన్నంగా పౌరసత్వ చట్టం, ముస్లిం మైనార్టీల పట్ల తీవ్రమైన వివక్ష చూపుతోందని తెలిపారు. సిఎఎ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్ వల్ల భారతదేశంలోని ముస్లింలకే కాకుండా అన్ని మతాలకు చెందిన ప్రజలు ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలు, ఆదివాసీలు, దళిత బలహీన వర్గాల వారు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. అస్సాంలో ఎన్ఆర్‌సి అమలు చేయడం వల్ల ఆ రాష్ట్రంలోని 3 కోట్ల 30 లక్షల మంది జనాభా తమ పౌరసత్వం నిరూపించుకోవాల్సి వచ్చిందని, ఇందు కోసం రూ 1200 కోట్లు ఖర్చు చేసి, 19 లక్షలా 60 వేల మందిని భారతీయ పౌరులు కారని తేల్చారని, వీరిలో 12 లక్షలకు పైగా హిందువులు కాగా మిగిలిన వారు ముస్లింలని తెలిపారు. ఎన్ఆర్‌సి వల్ల అస్సామీ గడ్డపై పుట్టిన ములవాసులే పౌరసత్వం కోల్పోయారని తెలిపారు. సిఎఎ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్ దేశవ్యాప్తంగా అమలు సరికాదన్నారు.

ముస్లిం మైనార్టీలకు సమాధానం చెప్పాలి

మదనపల్లికి వస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకొని వచ్చి మైనార్టీలను ఓట్లు అడుగుతారు, ప్రతి వాగ్దానంలోనూ మాట తప్పి మడమ తిప్పన ఈయనకు ఇక్కడికి వచ్చే అర్హత లేదని కాంగ్రెస్ పార్టీ నేత రెడ్డీ సాహెబ్ పేర్కొన్నారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మైనార్టీలకు సిఎఎ, ఎన్ఆర్‌సిలపై స్పష్టత ఇవ్వాలన్నారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ బాషా, రాష్ట్ర మహిళా అధ్యక్షులు మీనాకుమారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వై.సురేంద్రరెడ్డి, నిమ్మనపల్లి మండల అధ్యక్షులు ముబారక్ ఖాన్, నాయకులు సోమశేఖర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పార్టీకి బిసిలు వెన్నెముక : టిడిపి

ప్రజాశక్తి- గాలివీడు

టిడిపికి బిసిలు వెన్నెముకలాంటివారని, పార్టీ మనుగడకు వారి కృషి ఎంతో ఉందని రాయచోటి అసెంబ్లీ టిడిపి అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గాలివీడులో నిర్వహించిన జయహో బిసి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల మనిషిగా మీ ముందుకు వస్తున్నానని తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, బిసి సబ్‌ప్లాన్ చట్టం తీసుకొచ్చేందుకు చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేస్తారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే సర్పంచ్ నుంచి ఎంపిటిసి వరకు అన్ని స్థానాలు బిసిలకే కేటాయించి ఏకగ్రీవం చేయిస్తానని చెప్పారు. వైసిపి బిసిలను అణగదొక్కిందని విమర్శించారు. కార్యక్రమంలో కసిరెడ్డి వెంకట శివారెడ్డి, గజుల ఖాదర్‌భాష్వా, మాజీ సర్పంచులు కొండ్రెడ్డి, నారాయణరెడ్డి, బి.కె. మహమ్మద్, రియాజ్ శ్రీనివాసరాజు, డాక్టర్ రామచంద్రారెడ్డి లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కెడిఎం లక్ష్మయ్య, రవీంద్రబాబు, టిడిపి కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సైన్స్ నుంచి పుట్టిందే సాంకేతికత

ప్రజాశక్తి-మదనపల్లి

వందల ఏళ్ల కాలం క్రితమే సైన్స్ నుంచి పుట్టిందే సాంకేతికత (ఇంజినీరింగ్) అని కల్పగం అటామిక్ రీసెర్చ్ సెంటర్ ప్రతినిధి డాక్టర్ జాన్ ఫిలిప్ పేర్కొన్నారు. న్యూఢిల్లీకి చెందిన ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మదనపల్లి శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు వర్క్‌షాప్ ప్రారంభించారు. దేశంలోని మూడు సైన్స్ అకాడమీలు సంయుక్తంగా నిర్వహించే ఈ సైన్స్ వర్క్‌షాప్ సాధారణంగా ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలో జరుగుతుందని, కానీ ఈసారి ఎంపికల్లో రాష్ట్రంలోనే తొలిసారిగా న్యాక్ ఎ ప్లస్ గుర్తింపు కలిగిన శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు దక్కిందని పేర్కొన్నారు. సైన్స్‌లో మూలకాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని వాటి ఉపయోగాలు, ఫలితాలు గురించి వివరించారు. చెన్నైలోని శివ నాడార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.పి.రాజేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు చాలా చురుగ్గా ఉంటారని, సైన్స్ పట్ల అవగాహన పెంచుకుంటారన్నారు. ఉన్నత విద్యాశాఖ ఆర్జెడి పి.బాబు, ఎస్వీయూ ప్రొఫెసర్లు విజయభాస్కరరావు, దేవ ప్రసాద్ రాజు విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ వర్క్ షాప్‌కు కన్వీనర్‌గా జయశంకర్ వ్యవహరించగా కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ రాఘవేంద్ర, ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రామాంజులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-వీరబల్లి

రోళ్ళ మడుగు వాటర్ పైప్ లైన్‌కు ఎంపిడిఒ రామచంద్ర రెడ్డి సోమవారం మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టారు. .రోళ్ల మడుగు నుంచి వీరబల్లికి వస్తున్న వాటర్ పైపు లైనుకు కోనేటి వాండ్లపల్లి దూల హరిజనవాడ, దగ్గర, రైతులు రంధ్రం వేసి ఆ నీటిని మామిడి చెట్లకు ఉపయోగించుకునే వారు. విషయం తెలుసుకున్న స్థానికులు ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన స్పందించి జెసిపి సహాయంతో పైపు లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ఇలాంటివి ఎక్కడైనా రిపీట్ అయితే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. మండలంలో ఎక్కడ నీటి సమస్య లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ కృష్ణయ్యకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, మండల కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

'మిట్స్' సెక్యూరిటీ సూపర్‌వైజర్ వెంకటరమణ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్ళులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సెక్యూరిటీ సూపర్వైజర్‌గా పనిచేస్తున్న మండలంలోని వలసపల్లికి చెందిన వెంకటరమణ(50) సోమవారం ఉదయం స్వగ్రామంలో వాకింగ్ చేస్తూ స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే మదనపల్లి ప్రభుత్వ అసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. గుండెపోటుతో చనిపోయినట్లు భావిస్తున్నారు. ఇతనికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం ఉన్నారు. మిట్స్ కళాశాల ప్రారంభం నుండి 25 ఏళ్లుగా సెక్యూరిటీ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నారు. ఇతను అంకిత భావంతో కళాశాల కోసం పనిచేశాడు. ఇతని ఆకస్మిక మృతి పట్ల కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ నాదేళ్ల విజయ భాస్కర్ చౌదరి, ఆర్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ నాదేళ్ల ద్వారకనాథ్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్, సిబ్బంది, పలువురు వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్ మంగళవారం (సా)	షహారీ బుధవారం (ఉ)
6.31	4.55



గుర్రంకొండ : కిషోర్‌కుమార్‌రెడ్డిని అభినందిస్తున్న నాయకులు

టిడిపిలో మాజీ ఎంపిపి చేరిక

ప్రజాశక్తి-గుర్రంకొండ

మాజీ ఎంపిపి గాజుల మాధవి, ఆమె కుటుంబ సభ్యులు కుటుంబ సభ్యులు గాజులు బాబు గాజుల రెడ్డి గాజుల రమేష్ పలువురు నాయకులు, కార్యకర్తలు పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో సోమవారం చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు రాజధాని లేని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతాడని నమ్మకంతో ప్రజలు తమ పార్టీని ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నాయని జగదీష్ కుమార్, మేకల చలపతి, ఎల్లుట్ల సుధాకర్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

రామసముద్రం : మండలంలోని అరికెల పంచాయతీ కేంద్రంలో టిడిపి అభ్యర్థి షాజహాన్ బాషా ఆధ్వర్యంలో వైసిపికి చెందిన ఉప సర్పంచ్ కస్తూరమ్మ, ఆమె భర్త రెడ్డప్ప, ఇతరులు దాదాపుగా 30 కుటుంబాలకు పైగా మండల పార్టీ అధ్యక్షుడు గౌనివారి విజయకుమార్ గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణంరాజు యాదవ్ సమక్షంలో టిడిపి కండువా కప్పుకున్నారు. వినయ్ కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డప్పరెడ్డి, కేశవరెడ్డి, రాజశేఖర్ నాయుడు, రఘునాథ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి టిడిపిలో చేరారు.

పింఛన్ల పంపిణీపై ఆరోపణలు తగవు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సచివాలయ సిబ్బంది గ్రామ కార్యదర్శులతో పింఛన్లు పంపిణీ చేయించకపోవడానికి నిధులు నిధుల కొరతే కారణమని, ఎన్నికల కమిషన్ గాని, టిడిపి గాని అడ్డు తగలడం లేదని, పింఛన్ల పంపిణీపై వైసిపి తప్పుడు ప్రచారం మానుకోవాలని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటో తేదీన అవ్వ, తాతలకు ఇవ్వాల్సిన పింఛన్ సొమ్ములతోపాటు ఆరోగ్యశ్రీకి ఇవ్వాల్సిన నిధులు రూ.13 వేల కోట్లు మార్చి 16 నుంచి 30వ తేదీ లోపల 15 రోజుల్లోనే జగన్ తన అనుకూల కాంట్రాక్టర్లకు దోచిపెట్టేశారని విమర్శించారు. పింఛన్ల సొమ్ము ఇవ్వడానికి ఖజానాలో సరిపడా నిధులు లేవన్నారు. జగన్ స్వార్థ రాజకీయాల వలన పింఛనుదారులు, వాలంటీర్లు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. 1.35 లక్షల సచివాలయ సిబ్బంది ద్వారా యుద్ధ ప్రాతిపదికన పింఛన్లు ఇంటి వద్ద పంపిణీ చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు రూ.4 వేల పింఛను పంపిణీ చేస్తామన్నారు.

రాతిగుంటపల్లిలో వైసిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని రాతిగుంటపల్లి పంచాయతీలో శ్రీనివాసపురం, బిసి కాలనీ, దిగువబట్టువారిపల్లి, దొడ్డిపల్లి పంచాయతీలోని గోపాలపురం గ్రామాలలో గడప గడపకూ వెళ్లి వైసిపి తరపున ప్రచారం చేసి ఎంపీ మిథున్‌రెడ్డి, చింతల రామచంద్రరెడ్డిని గెలిపించాలని వైసిపి నాయకులు చింతల శివానందరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి, వైసిపి కన్వీనర్ కమలాకర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, నాయకులు చిన్నరెడ్డప్ప, వేంకటేశ్వరరావు, అంజన్‌కుమార్, ప్రదీప్‌రెడ్డి, మస్తాన్, చలమయ్య, కుమార్‌రెడ్డి, రెడ్డప్ప, వెంకటరమణరెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి-గాలివీడు

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపిడిఒ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయ సభాభవనంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 3 నుంచి పింఛన్లు గ్రామ సచివాలయంలోనే సచివాలయం ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వాలంటరీ దగ్గర ఉన్న సెల్‌ఫోన్లు, ట్యాబులు స్వాధీనం చేసుకోవాలని అని పేర్కొన్నారు కార్యక్రమంలో తహశీల్దార్ తిమ్మారెడ్డి, యువ పిఆర్‌డి శేఖర్ నాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్ర డైరెక్టర్ వేదవ్యాస్‌కు సన్మానం

ప్రజాశక్తి - చిట్వేలు

ఎపి ఎస్‌సి కార్పొరేషన్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే గుంటి ప్రసాద్ కుమారుడు గుంటి వేద వ్యాస్‌ను వైసిపి కన్వీనర్ చెవ్వు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పటి నుండి వారి కుటుంబంతో సంబంధాలతోపాటు మండల అభివృద్ధికి కీలక పాత్ర పోషించారన్నారు. అలాంటి కుటుంబం నుండి ఈరోజు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులు కావడం ఆనందంగా ఉందన్నారు. వేదవ్యాస్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం మా కుటుంబం పట్ల చూపిన ఆదరణ మర్చిపోలేదని, వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో జగనన్నను గెలిపించేందుకు నా వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్టేట్ కార్పొరేషన్ మలిశెట్టి వెంకటరమణ, ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి, రవీంద్ర, పద్మాకర్, చంద్ర, రమణారెడ్డి, నాగిరెడ్డి, నాగేష్, ఈశ్వరయ్య, సుధాకర్, నరసింహ పాల్గొన్నారు.

మల్లయ్య కొండ గోవులకు పశుగ్రాసం వితరణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మల్లయ్య కొండ ఆలయం గోశాలలోని ఆవులకు తంబళ్లపల్లెకు చెందిన సతీష్ సోమవారం మూడు ట్రాక్టర్ల మొక్కజొన్న గ్రాసాన్ని వితరణగా ఇచ్చారు. మెడికల్ షాప్ నారాయణరెడ్డి, రామ్మూర్తి, శ్రీనివాసులు, సహదేవ రవాణా ఖర్చులు భరించి ఆ పశుగ్రాసాన్ని మల్లయ్య కొండపై గోశాలకు చేర్చారు. వారి దాతృత్వాన్ని ఆలయ కమిటీ చైర్మన్ మల్ రెడ్డి, ఇఒ రమణ, ధర్మకర్త ప్రభాకర్ రెడ్డి అభినందించారు. మల్లయ్య కొండపై అడవి అగ్నికి ఆహుతి కావడంతో ఆవులకు పశుగ్రాసం కొరత ఏర్పడిందని ఎవరైనా దాతలు పశుగ్రాసాన్ని వితరణగా అందజేయాలని కోరారు.

అలరించిన అర్జున తపస్మాన్

ప్రజాశక్తి- కలకడ

అర్జున తపస్మాన్ భక్తులను అలరించింది. మండలంలోని దేవలంపేటలో వెలిసిన శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న మహాభారత యుద్ధంలో భాగంగా సోమవారం అర్జున తపస్మాన్ భక్తులను ఆకట్టుకుంది. అర్జున పాత్ర వేషధారణ తపస్మాన్ అధిరోహించే సమయంలో ఒక్కొక్క మెట్టుకు ఒక్కొక్క పద్యం దానం చేస్తూ తపస్మాన్ అధిరోహించి శివున్ని మెప్పించి పాశుపదార్థం తేవడానికి అర్జునుడు ఈ యజ్ఞం చేసినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం అర్జునుడు తపస్మాన్ ఎక్కడ భక్తులను అలరింపజేసింది అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు మంచిపెట్టారు.

హామీల అమలులో జగన్ విఫలం : 'దాసరిపల్లి'

ప్రజాశక్తి-ములకలచెరువు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందారని తంబళ్లపల్లి టిడిపి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పింఛన్లు పంపిణీ అడ్డుకుంటుంది అనే అవాస్తవ ప్రచారాలు నమ్మవద్దన్నారు. పింఛన్లువాలంటీర్ల చేత పంపిణీ చేయించ కూడదని ఎన్నికల కమిషన్ నిభంధనల మేరకు వాలంటీర్లు పంపిణీ చేయకూడద ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. వైసిపి నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలు నమ్మవద్దని తెలిపారు. జగన్ తంబళ్లపల్లి నియోజకవర్గ ప్రచారానికి వస్తున్నారని గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఏ మొహం పెట్టుకొని వస్తున్నారని ప్రశ్నించారు. గతంలో పాదయాత్రలో ఇచ్చిన ఎ ఒక్క హామీ నెరవేర్చలేదని తెలిపారు. హంద్రీనీవా కాలువలు హామీ నెరవేర్చలేదు నీళ్ళు రైతులకు అందలేదన్నారు. ఆ రోజు రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాను అని చెప్పారు కానీ ఎ ఒక్క రైతుకు గిట్టుబాటు ధర కల్పించలేదు. టమాటా చెరకు మామిడి రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఎలావస్తావన్నారు.

మా గ్రామానికి భద్రత కల్పించండి

కలెక్టర్‌కు విన్నవించుకున్న అద్దవారిపల్లె గ్రామస్తులు

ప్రజాశక్తి - రాయచోటి

వరదప్పగారి వరదారెడ్డి, ఆయన కుమారుడు వెంకటేశ్వర రెడ్డి భారి నుండి తమ గ్రామానికి భద్రత కల్పించాలంటూ అన్నమయ్య జిల్లా పరిధిలోని కలికిరి మండలం, గుండ్లూరు గ్రామ పంచాయతీలోని అద్దవారిపల్లె గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన పార్వతమ్మ, ఈశ్వరమ్మ, సుశీలమ్మ, అమర్నాథరెడ్డి తదితరులు తమ గ్రామంలో వరదారెడ్డి, ఆయన కుమారుడు వెంకటేశ్వర్‌రెడ్డిలు చేస్తున్న భూకబ్జాలు, అక్రమాలు, గ్రామస్తులపై చేస్తున్న దౌర్జన్యాల గురించి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఆడవారిపల్లి గ్రామానికి చెందిన వరదా రెడ్డి, ఆయన కుమారుడు వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామంలో అందరి మధ్య తగాదాలు సృష్టిస్తూ ఇబ్బందులకు గురి చేస్తూ ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగనివ్వకుండా అడ్డుపడుతున్నారని చెప్పారు. ప్రశ్నించిన వారిపై తన అనుచరులుగా ఉన్న ఎస్సీ, ఎస్టీలకు మద్యం తాగించి తప్పుడు కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో వారిరువురూ ప్రభుత్వ స్థలాల ఆక్రమించడమే కాకుండా భూములను సైతం ఆక్రమించి తప్పుడు రికార్డులు సృష్టించుకుని, విక్రయించి సొమ్ము చేసుకోవడమే కాకుండా కొన్ని ప్రాంతాలలో భవనాల నిర్మించి బాడుగలకు ఇచ్చి అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారని ఆరోపించారు. గ్రామంలో ఎవరైనా ఇళ్లు కట్టుకోవాలన్నా, ఏదైనా పొలం సాగు చేసుకోవాలన్నా, బోరు వేసుకోవాలన్నా వారిని ఆ పనులు చేయకుండా అడ్డుపడుతూ తహశీల్దార్ కార్యాలయం, వ ండల పరిషత్ కార్యాలయాలలో తప్పుడు ఫిర్యాదులు చేస్తూ గ్రామస్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న అద్దవారిపల్లె గ్రామస్తులు

ఆవేదన చెందారు. అక్రమాలపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేస్తే రాత్రి అవగానే ఎస్సీ, ఎస్టీలకు మద్యం తాపించి గ్రామంపైకి ఎగదోలి నానా బూతులు కాకుండా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించి ప్రతి ఒక్కరిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కనీసం జగనన్న ఇళ్ల కూడా గ్రామంలో ఎవరిని కట్టుకోనివ్వకుండా అడ్డుపడుతూ ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. అంతేగాక గుండ్లూరు వద్ద గుడి జాగాలో వచ్చే ఆదాయాన్ని కాజేసి స్వాహా చేశారంటూ ఆరోపించారు. మా బావ దగ్గర సంతకం పెట్టించుకుని, తప్పుడు ప్రచారం చేస్తూ వేధింపులు గురి చేస్తున్నారని ఈశ్వరమ్మ, సుశీలమ్మలు చెప్పారు. గ్రామస్తులను ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెడుతున్న వరదప్పగారి వరదారెడ్డి, ఆయన కుమారుడు వెంకటేశ్వర్ రెడ్డి భారి నుండి తమకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని వారు కోరారు.

రాజంపేట టికెట్ 'బత్యాల'కే ఇవ్వాలి



ర్యాలీగా వెళుతున్న బత్యాల అనుచరులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి రాజంపేట అసెంబ్లీ టికెట్ బత్యాల చెంగల రాయుడికే కేటాయించాలని కోరుతూ సోమవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల ఆధ్వర్యంలో ఎస్సార్ కల్యాణ మంటపం నుంచి పాత బస్టాండ్ మీదుగా యల్లమ్మ ఆలయం వరకు బలనిరూపణ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బత్యాల అనుచరులు, అభిమానులు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొని సుగవాసి వద్దు, బత్యాల ముద్దు అంటూ నినాదాలు చేశారు. రాజంపేట అన్ని విధాల అభివృద్ధి చెందాలన్నా, జిల్లా కేంద్రం సాధించుకోవాలన్నా బత్యాలతోనే సాధ్యమని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బత్యాల వర్గీయులు మాట్లాడుతూ గత ఎన్నికలలో ఓటమిపాలైనా నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలు చురుగ్గా కొనసాగించి రాజంపేటలో టిడిపి బలోపేతం చేసిన భత్యాలను కాదని రాయచోటికి చెందిన సుగవాసికి సీటు కేటాయించడం జీర్ణించుకోలేకపోతున్నామని తెలిపారు. చంద్రబాబు నాయుడు ఇప్పటికైనా పునరాలోచించి సుగవాసిని బుజ్జగించి నియోజకవర్గ వ్యాప్తంగా గట్టిపట్టున్న బత్యాల చెంగల రాయుడును రాజంపేట అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. బత్యాలకు టికెట్ కేటాయించకపోతే ఆత్మహత్యలకు కూడా వెనకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సుండుపల్లె, వీరబల్లె, రాజంపేట నందులూరు, ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల నుంచి టిడిపి అభిమానులు, బత్యాల వర్గీయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైసిపికి ఓటు అడిగే నైతిక హక్కు లేదు

ప్రజాశక్తి-రామసముద్రం

వైసిపికి ఓటు అడిగే హక్కు లేదని మదనపల్లె టిడిపి అభ్యర్థి షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రామసముద్రం మండలానికి హంద్రీ-నీవా తీసుకొచ్చి మండలాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చి నేడు హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. ప్రజలను ఏమార్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మారాయని విమర్శించారు. మదనపల్లెలో పేద ముస్లిం కుటుంబాలు వక్ఫ్ బోర్డ్ ఖాళీ స్థలంలో బతుకుదెరువు కోసం 300 కుటుంబాలు షెడ్లు నిర్మించుకుంటే వాటిని ధ్వంసం చేసి రోడ్డుపాలు చేసిన ఘనత ఎంపీ, ఎమ్మెల్యేల దక్కుతుందని మండిపడ్డారు. ప్రజలు ఇప్పటికే వైసిపి ప్రభుత్వ ఆగడాలకు బలయ్యారని తిరిగి తమను తాము బలి చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా లేరని ప్రజలు మేల్కొనాలని తెలిపారు. ఈ ఎన్నికల్లో వైసిపిను సాగనంపేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఏ ముఖం పెట్టుకొని జగన్మోహన్‌రెడ్డి మదనపల్లికి వస్తున్నారని ప్రశ్నించారు. దేశంలోనే అన్ని అర్హతలు ఉన్న మదనపల్లెను జిల్లాగా ప్రకటించకుండా కనీస వసతులు లేక రోడ్డు సౌకర్యం లేని రాయచోటిని జిల్లాగా ప్రకటించడం మదనపల్లె ప్రజలను మోసం చేయడమేనని చెప్పారు. అడుగడుగునా ప్రజలు తెలుగుదేశం పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో



మాట్లాడుతున్న షాజహాన్‌బాషా

మండల పార్టీ అధ్యక్షుడు గౌని వారి విజయ్ కుమార్ గౌడ్, కృష్ణంరాజు యాదవ్, కొండూరు నారాయణరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు శివశంకర్ రాజేష్ బిసి సెల్ వెంకటరమణ, తెలుగు యువత అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, అరికెల బాబు, మునుస్వామిరెడ్డి, మట్లవారిపల్లి కృష్ణమూర్తి, రమేష్‌రెడ్డి కూరగాయల రమణ, మహేష్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

జగన్‌ను సాగనంపేందుకు ప్రజలు సిద్ధం : 'చమర్తి'



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి- వీరబల్లి

వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నమయ్య జిల్లా పార్లమెంటరీ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. సోమవారం టిడిపి మండల అధ్యక్షుడు భానుగోపాల్ రాజు, సురేంద్ర రెడ్డి, శ్రీదర్ రెడ్డి, ఆధ్వర్యంలో టిడిపి, జనసేన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపిపాలన పట్ల అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారని ఆయన చెప్పారు. అధిష్టానం బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి సుగువాసి బాలసుబ్రమణ్యంను, బిజెపి పార్లమెంటరీ అభ్యర్థి నల్లరి కిరణ్ కుమార్ రెడ్డిని అత్యంత మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీ అధిష్టానం తనకు టికెట్ ఇవ్వకపోయినా తన ఏనాడు బాధపడలేదని ఒక కార్యకర్తగా ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. పార్టీ అధికారంలో లేకపోయినా తనను వెన్నంటి నడిచిన ప్రతి కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా ముందుంటానని తెలిపారు. కష్టకాలంలో పార్టీకి సేవ చేసిన ప్రతి కార్యకర్తకు భరోసా ఇచ్చేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో ఎన్నో గ్రామాలకు తాగునీటి వసతికి ఇబ్బందులకు గురిచేసినా సిమెంట్ రోడ్లు వేయకపోయినా అటువంటి సందర్భంలో కూడా తమ వంతు సహాయం చేశామని తెలిపారు. టిడిపి జాతీయ నాయకులు చంద్రబాబు ఆదేశానుసారం తమ పార్టీకి విధేయుడుగా ఉంటూ పార్టీ సూచించిన వ్యక్తికే తన మద్దతు ఉంటుందని తెలిపారు. తమ ప్రభుత్వంలో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి భాను గోపాల్ రాజు, రెడ్డప్ప రెడ్డి, సురేంద్ర రెడ్డి, శ్రీధర్ రెడ్డి, భాస్కర్ రాజు, అమరేశ్వర రాజు, సుధాకర్ రాజు, నాయకులు, సర్పంచ్ నాగార్జున ఆచారి, మాజీ సర్పంచ్ నేతి వెంకటరమణ, చంద్ర రెడ్డి, న్యాగభూషణం, మాజీ సర్పంచ్ ఆంజన్జేయులు, దుర్గం ఆంజన్జేయులు, టిడిపి మహిళా ఉపాధ్యక్షురాలు నాగ సుబ్బమ్మ, ఎస్సీ సెల్ వెంకటరమణ, ఎంఆర్‌పిఎస్ నాయకులు నరసింహులు, బిజెపి మండల అధ్యక్షుడు నరేంద్ర గౌడ్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

'మిట్స్'లో డేటా సైన్స్‌పై సెమినార్

ప్రజాశక్తి-మదనపల్లి

ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ స్పాన్సర్ చేసిన మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ లెక్చర్ వర్క్‌షాప్‌ను నంబర్ అనలిటిక్స్ అండ్ డేటా సైన్స్‌పై నిర్వహించినట్లు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్ తెలిపారు. రెండు రోజుల పాటు ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ పి.కందసామి, రిటైర్డ్ ప్రొఫెసర్, గణిత విభాగం, భారతియార్ విశ్వవిద్యాలయం, కోయంబత్తూరు, తమిళనాడు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి సమీకృత ప్రపంచంలో ప్రతి సెకనుకు డేటా సమీకరణ జరుగుతోంది. డేటా సైన్స్ అనేది ప్రాథమికంగా అంతర్దృష్టులను అందించడానికి ఈ భారీ డేటాను సరళీకరించడం మరియు వేరు చేసే ప్రక్రియ అని అన్నారు. నెంబర్ సిస్టం అనేది కంప్యూటర్ లోగిక్స్ కు జతచేయబడి ఉంటుందని, నెంబర్ థియోరి పై విద్యార్థు మరియు అధ్యాపకులు దృష్టిపెట్టాలన్నారు. కోడింగ్, ఎనలిటిక్స్, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, డేటా విజువలైజేషన్ వంటివన్నీ ఉద్యోగ పరంగా డేటా సైన్స్ అర్హతగా ఉంటున్నాయి అని, ఇతర రంగాలతో పోలిస్తే ఈ ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఫ్రెషర్స్ ఈ రంగంలోకి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు అని, వారు ముందు నుంచే అన్నీ తెలుసుకొని ఉండాలని సంస్థలు కోరకోకపోయినా కొన్ని ముఖ్యమైన విషయాల్లో మాత్రం నాలెడ్జ్ ఉండాలని భావిస్తున్నాయి అని అన్నారు. అందుకే డేటా సైన్స్ విభాగంలో ఉద్యోగాలు సంపాదించాలనుకునే వారు కొన్ని ముఖ్యమైన అంశాలపై దృష్టి పెట్టుకోవాలి. ప్రస్తుతం, విమానయానం నుండి తయారీ వరకు, రిటైల్ నుండి ఫార్మాస్యూటికల్స్ వరకు, గేమింగ్ నుండి విద్య వరకు, ప్రతి విభాగం దాని లక్ష్యాలను సాధించడానికి సమాచార నిర?యాలను తీసుకోవడానికి డేటా సైన్స్‌ను ప్రభావితం చేస్తుంది అని అన్నారు. డేటా సైన్స్ దాని విస్తారమైన పరిధి, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్‌తో భారతదేశంలోని యువత డేటా సైన్స్‌పై దృష్టిని, డేటా సైంటిస్టుల కెరీర్ ఎంపికలను అధ్యయనం చేయడం తోడ్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్, హెడ్ డాక్టర్ శ్రీదేవి, కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ పద్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

ప్రజాశక్తి - నందలూరు

అభివృద్ధి చూసి ఆశీర్వదించాలని ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డి, రాజంపేట నియోజకవర్గ నేత ఆకేపాటి అనిల్ కుమార్ రెడ్డి అభ్యర్థించారు. సోమవారం మండలంలోని టంగుటూరు, టీవీపురం గ్రామ పంచాయతీలలో వారు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సిఎం జగన్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో మళ్లీ వైసిపి పార్టీకి పట్టం కట్టాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మన జగనన్న ప్రతి ఒక్క సంక్షేమ పథకం మహిళల ఖాతాలోనే వెస్తున్నారన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి ప్రతినిధి గడికోట వెంకట సుబ్బారెడ్డి, నందలూరు మండల పార్టీ మాజీ కన్వీనర్ సిద్దవరం గోపిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ అన్నం నాగేంద్ర, టంగుటూరు సర్పంచ్ మైనుద్దీన్, ఎన్ టి పల్లి సర్పంచ్ ప్రతినిధి గీతాల నరసింహారెడ్డి, జెసిఎస్ కన్వీనర్ కలీం, బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు భాస్కర్, లోకేశ్వరయ్య, మురహరి, ఈశ్వరయ్య, మాజీ ఎంపిటిసి అక్బర్ ఖాన్, చుక్క వెంకటేశ్వరయ్య, నాయకులు షేక్ షావల్లి, నరేష్, సుబ్బరాజు, తిరుపాలు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ కిషోర్ కుమార్‌రెడ్డి

అంగన్వాడీ కేంద్రంలో డాక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-కలకడ

ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిషోర్ కుమార్‌రెడ్డి సోమవారం మండలంలోని దేవలపల్లి పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల అంగన్వాడీ కేంద్రంలో స్కూల్ హెడ్మాస్టర్ విచారించగా అక్కడ ఎలాంటి చిరు వ్యాధులు లేవని తెలిపారు పిల్లలందరినీ ఆరోగ్యపరంగా స్క్రీనింగ్ చేశామన్నారు. వేసవిలో వచ్చే వ్యాధులు డయేరియా, వాంతులు, విరేచనాలు, విషజ్వరాలు, దగ్గు జలుబు ఎవరికి లేనట్లు నిర్ధారించారు. వేసవిలో పిల్లలు ఉదయం 9 గంటల లోపల సాయంత్రం ఆరు తర్వాత ఆరుబయట తిరగాలని, 50 సంవత్సరాలు పైబడిన వారు కూడా ఉదయం 10 గంటల లోపు సాయంత్రం 5 గంటల తర్వాత వ్యవసాయ పొలాలకు వెళ్లాలని వెళ్లేటప్పుడు తల పైన తలపాగా, గొడుగు మజ్జిగ బాటలు వాటర్ బాటిల్ తీసుకొని వెళ్లాలని వేసవిలో వచ్చే సన్ స్ట్రోక్ జాగ్రత్తగా తీసుకోవాలని వైద్యాధికారి పేర్కొన్నారు. 53 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య, ఎంపిహెచ్ ఎస్.వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు బి.రాధాదేవి, వెంకటేశ్వర్లు, ఆరోగ్య కార్యకర్తలు డి.వరలక్ష్మి ఎస్.వి.రమణమ్మ ఎంఎల్‌హెచ్. పి.ఎ.రాజ సులోచన ఆశా కార్యకర్తలు డి.రెడ్డమ్మ జి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సిద్ధం సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మదనపల్లిలో మంగళవారం జరిగే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి సిద్ధం సభ విజయవంతం చేయాలని వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ అహ్మద్ పిలుపునిచ్చారు. సోమవారం నిర్వహించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జగన్‌ను మళ్ళీ సిఎం చేయాలంటే ఎన్నికల ముందు ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు 99 శాతం అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మదనపల్లిలో జరిగే సిఎం సభకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. సమావేశంలో వైసిపి మండల కన్వీనర్ ప్రదీప్ రెడ్డి, టౌన్ కన్వీనర్ సి.ఆర్.చిన్నికృష్ణ, జెసిఎస్ మండల కన్వీనర్‌రెడ్డి హరి, జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్‌బాషా, కో-ఆప్షన్ నెంబర్ నాసర్, సద్దాం, సాయి, అభిలాష్‌రెడ్డి, బోయ వీధి మంజు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా : 'మండిపల్లి'

ప్రజాశక్తి-రామాపురం

నియోజకవర్గం ప్రజలు ఆదరిస్తే అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తానని, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీలోని శివాలయంలో సోమవారం మొదటిగా ప్రత్యేక పూజలు చేసి అనంతరం హసనాపురంలో ప్రచారం నిర్వహించార. మొదటిగా వసంత వాండ్లపల్లి, చీకటి వాండ్లపల్లి, ఎరింగివాండ్లపల్లి, హసనాపుర, పప్పిడిగారిపల్లి. గొల్లపల్లి గ్రామాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాలలో ఆయనకు పూలమాలలతో మహిళలు ప్రజలు ఘన స్వాగతం పలికారు. గొల్లపల్లిలో టిడిపి నాయకుడు పప్పి రెడ్డి హరినాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి. పరమేశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఇరగమారెడ్డి ఆధ్వర్యంలో ఆయనను గజమాలతో స్వాగతం పలికి పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు.

200 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలో చేరిక..

మండలంలోని హసనాపురంలో రాయచోటి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా మాజీ జడ్‌పిటిసి నాగసుబ్బారెడ్డి, హరినాథ్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ఉపసర్పంచ్ ఇరగంరెడ్డితో పాటు చీకటి వాండ్లపల్లి, పప్పి రెడ్డి గారిపల్లి. గొల్లపల్లి. హసనాపురం. గ్రామాల్లో వైసిపి రూ. 200 కుటుంబాలు టిడిపిలో చేరారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి. రామాంజనేయరెడ్డి. అల్లా బకాష్. పెంచల్ రెడ్డి. ద్వారకానాథ్ రెడ్డి. రమేష్ రెడ్డి .విజయభాస్కర్ రెడ్డి. గంగిరెడ్డి టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

క్రైం కార్నర్



పట్టుబడిన నిందితుడు, ఎర్రచందనం, కారుతో పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

శేషాచలం అడవుల నుంచి తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న 10 ఎర్రచందనం దుంగలతో సహా కారు స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు పీలేరు అటవీ శాఖ సంచార దళ నిఘా విభాగం డిఎఫ్ఒ జెవి సుబ్బారెడ్డి తెలిపారు. తమ కార్యాలయానికి అందిన రహస్య సమాచారం మేరకు ఆదివారం రాత్రి చిత్తూరు జిల్లా, కందూరు సమీపంలో తాను తన సిబ్బందితో కలిసి కాపుకాచామన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం కలికిరి వైపు నుండి ఓ కారు వేగంగా రావడానికి గమనించి, ఆపడానికి ప్రయత్నించామన్నారు. తమను గుర్తించిన ఆ కారు డ్రైవర్ తన వాహనాన్ని చౌడేపల్లి వైపుకు మళ్లించి మరింత వేగంగా ముందుకు దూసుకు వెళ్ళాడన్నారు. ఆ వాహనాన్ని తాము వెంబడించి రాయలపేట వద్ద అడ్డగించామన్నారు. కారులోని నలుగురు నిందితులు పారిపోతుండగా ఒకరిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టు బడిన వ్యక్తి తమిళనాడు రాష్ట్రం, జమునా ముత్తూరుకు చెందిన తాతన్ కె. గా గుర్తించామని చెప్పారు. ఈ సందరేగా 345 కిలోల బరువు గల 10 ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. వీటి విలువ సుమారు రూ.15 లక్షలుగా అంచనా వేయడం జరిగిందన్నారు. పారిపోయిన ముగ్గురు నిందితుల కోసం దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో వారిని కూడా అరెస్టు చేస్తామని తెలియజేశారు. ఈ దాడిలో తనతో పాటు ఎఫ్ఆర్ఒ, ఎఫ్ఎస్ఒ ఎన్.వెంకట్రమణ, కె.ప్రతాప్, ఎఫ్‌బిఒ, ఎఫ్ఎస్‌పి, ప్రొటెక్షన్ వాచర్లు డి.చరణ్, డ్రైవర్ ఎ.సుబ్రమణ్యం పాల్గొన్నారని పేర్కొన్నారు.